ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 22 ఏప్రిల్ 2024

సెంటిమెంట్ జిల్లాపై బీఆర్ఎస్ ఆశలు



- ఉమ్మడి జిల్లాలో ఐదు రోడ్‌షోల్లో కేసీఆర్
- ఆయా ప్రాంతాల్లో రాత్రి బస
- ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశా నిర్దేశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచి, ప్రతి కీలక సందర్భంలోనూ కేసీఆర్‌కు సెంటిమెంట్‌గా నిలుస్తూ వస్తున్న ఉమ్మడి జిల్లాలో తిరిగి కారును పరుగెత్తించాలని బీఆర్ఎస్ అధినాయకత్వం భావిస్తున్నది. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎలాగైనా విజయం సాధించి పూర్వవైభవాన్ని తిరిగి పొందాలని ఆ పార్టీ ఆశిస్తున్నది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సెంటిమెంట్ జిల్లా అయిన కరీంనగర్‌లో ప్రజల ఆలోచనల్లో వచ్చే మార్పు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిఫలిస్తుందని ఆ పార్టీ విశ్వసిస్తున్నది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. హుస్నాబాద్, మానకొండూర్, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపొందింది. ఈ నియోజకవర్గ పరిధిలో నాలుగు అసెంబ్లీ స్థానాలను సాంకేతికంగా కాంగ్రెస్ గెలుచుకున్నా సాధించిన ఓట్లను పరి గణలోకి తీసుకుంటే ఐదువేల పైచిలుకు ఓట్లు బీఆర్ఎస్‌కే అధికంగా వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇప్పటికీ ప్రజల ఆలోచనల్లో కొంత మార్పు వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం తమకు కలిసి వచ్చే అంశంగా ఆ పార్టీ భావిస్తున్నది. ఇక్కడి నుంచి రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బి వినోద్‌కుమార్‌ను అభ్యర్థిగా నిలిపింది. ఆయన గతంలో ఎంపీగా ఐదేళ్ల పదవీకాలంలో చేసిన పనులు తమకు లాభిస్తాయి అని అనుకుంటుంది.

పెద్దపల్లిలో ప్రత్యేక వ్యూహం

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో గోదావరిఖని ప్రాంతానికి చెందిన కార్మిక నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ని అభ్యర్థిగా రంగంలోకి దింపింది. కార్మిక నాయకుడిగా రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజక వర్గాల్లో ఆయనకున్న విస్తృత సంబంధాలు, ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గంలో మంత్రిగా ఆయన చేసిన అభివృద్ధి ఈ ఎన్నికల్లో ఓట్లు సాధించి పెడతాయని బీఆర్ఎస్ నాయకత్వం విశ్వసిస్తున్నది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే గెలుపొందడం ఆ పార్టీకి నిరాశను కలిగించే అంశం. అయినా ఉద్యమ కాలంలో వెన్నంటి ఉన్న కార్మికులు ఇప్పుడు కూడా తమకు సహకరిస్తారని ఆశిస్తూ ఆ వర్గంపైనే ఎక్కువ ఆశలు పెట్టుకొని కార్మిక నాయకుడైన ఈశ్వర్‌ను బరిలో నిలిపింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే ఒకసారి కరీంనగర్ ప్రజాశీర్వాద సభలో ప్రసంగించి వెళ్లారు. త్వరలో ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో రోడ్ షోల్లో పాల్గొనాలని నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ రోడ్‌షోలు ఇలా..

ఈ నెల 24 నుంచి 17 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా 21 రోడ్ షోలలో పాల్గొనాలని నిర్ణయించుకున్న కేసీఆర్ మే 2న జమ్మికుంటలో జరిగే రోడ్ షోలో పాల్గొని వీణవంక మండల కేంద్రంలో బస చేయాలని నిర్ణయించుకున్నారు. మే 3న రామగుండం రోడ్‌షోలో పాల్గొని రాత్రి అక్కడే బస చేస్తారు. 4న మంచిర్యాలలో జరిగే రోడ్ షోలో ప్రసంగించి రాత్రి కరీంనగర్‌లో బస చేస్తారు. మే 5న ఆయన జగిత్యాల రోడ్ షోలో పాల్గొని నిజామాబాద్ జిల్లాకు వెళ్తారు. తిరిగి ఆయన మే 9న కరీంనగర్‌కు వచ్చి ఇక్కడ జరిగే రోడ్‌షోలో ప్రసంగించి రాత్రి ఇక్కడే బస చేస్తారు. మే 10న సిరిసిల్లలో జరిగే రోడ్ షోలో పాల్గొని అక్కడ నుంచి సిద్దిపేటకు వెళ్లి బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

17 రోజులపాటు ఏకబిగిన పర్యటించి కేసీఆర్ బీఆర్ఎస్‌కు పూర్వవైభవం సాధించి పెట్టాలని నిర్ణయించుకున్నారు. రోడ్ షోలలో ప్రజలనుద్దేశించి ప్రసంగించడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో రాత్రిళ్లు బస చేస్తారు. నాయకులు, కార్యకర్తల్లో సమన్వయలోపం ఉంటే సరిదిద్ది అవసరమైన కార్యాచరణను సూచిస్తారు. కేసీఆర్ వెంట పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఉండేలా కార్యక్రమాలను రూపొందించు కుంటున్నారని సమాచారం. కరీంనగర్ నియోజక వర్గం లో ప్రస్తుతం బీజేపీకి చెందిన బండి సంజయ్‌కుమార్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తూ ప్రస్తుతం ఆయనే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు అధికారికంగా అభ్యర్థిని ప్రకటించక పోయినా కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు సోమవారం నామినేషన్ వేస్తున్నారు. ఈ నియోజక వర్గంలో మళ్లీ సంజయ్‌కుమార్ గెలువడం ఖాయమని బీజేపీ విశ్వసిస్తోంది.

కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గాన్ని తిరిగి తమ పరం చేసుకోవాలని బీఆర్ఎస్ ఆశిస్తున్నది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీ టికెట్ పొందేందుకు ప్రయత్నిస్తున్న వెంకటేశ్ నేత ఎంపీగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ గడ్డం వంశీ కృష్ణకు టికెట్ ఇవ్వగా బీజేపీ గోమాస శ్రీనివాస్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఒకటిరెండు రోజుల్లో బీజేపీ అభ్యర్థి మారుతారని, సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేతకు బీజేపీ టికెట్ వస్తుందని ప్రచారం జరుగుతున్నది. కరీంనగర్‌లో విజయం సాధించడంపై బీజేపీ, పెద్దపల్లిలో గెలుపుపై కాంగ్రెస్ ధీమాతో ఉండగా ఈ రెండింటిని కైవసం చేసుకొని పూర్వవైభవం పొందాలని బీఆర్ఎస్ భావిస్తోంది.



ఘనంగా గజ వాహన సేవ

ఇల్లందకుంట, ఏప్రిల్ 21: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి ప్రభుత్సోత్సవం అనంతరం గజ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. నిత్యవిధి అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ఘనంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గజ వాహనంపై అధిరోహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, కొడారి కుమారస్వామి, దేవేందర్‌రెడ్డి, రాయమల్లు, కౌశిక్, రవీందర్‌రెడ్డి, రావుల విజయ్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

పత్తి ధర పెరుగుతుందా.. తగ్గుతుందా

పది రోజుల్లో రూ. 300 తగ్గిన వైనం

జమ్మికుంట, ఏప్రిల్ 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో గడిచిన పది రోజుల వ్యవధిలో పత్తి ధర క్వింటాల్‌కు మూడు వందల రూపాయలు తగ్గింది. ఈ నెల 10 వరకు క్వింటాల్‌కు 7,650 రూపాయలు పలికింది. పత్తి ధరలు పెరగడంతో రైతులు కొంతమేర సంతోషం వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం ఇళ్లలో నిల్వలు చేసుకున్న పత్తిని విక్రయించుకునేందుకు ఆసక్తి కనబరి చారు. ఇటీవల మార్కెట్‌కు వరుస సెలవు దినాలు రావడంతో నెమ్మదిగా అమ్ముకుందామని భావించారు. ఇంతలో ధరలు తగ్గుముఖం పట్టడంతో పత్తి అమ్ముకునేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. బేళ్లు, గింజలు, నూనె ధరలు నిలకడగా ఉన్నప్పటికి ధరలు తగ్గడంపై రైతులు అలచనలో పడ్డారు. వరంగల్ మార్కెట్లో గడిచిన నెల రోజుల వ్యవధిలో పత్తి ధరలు రూ. 7,300లకు మించలేదు. జమ్మికుంటలో రూ. 7,650ల వరకు ధర పలికింది. స్థానికంగా పెరిగిన ధరలు వ్యాపారులు కృత్రిమంగా పెంచారనే విమర్శలున్నాయి. గరిష్ఠ ధర రూ. 7,650లు ఒకరిద్దరు రైతుల పత్తికి మాత్రమే చెల్లించి, మిగితా రైతులకు రూ. 7,350 లోపు చెల్లింస్తుంటారు. సోమవారం నుంచి పత్తి ధరలు తగ్గుతాయ, పెరుగుతాయా అని రైతుల్లో ఉత్కంఠ నెలకొంది.

యువత సివిల్స్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్



సాయికిరణ్, సహనను సన్మానిస్తున్న జస్టిస్ ఈవీ వేణుగోపాల్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21: యువత సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్ డేను పురస్కరించుకుని కరీంనగర్ మంకమ్మతోటలోని తన నివాసంలో ఆదివారం సివిల్ ర్యాంకర్లకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందాల సాయికిరణ్, కొలనుపాక సహనను ఆయన అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారితో జస్టిస్ ఈవీ వేణుగోపాల్ మాట్లాడారు. రాజ్యాంగానికి లోబడి ఉద్యోగ వృత్తిని కొనసాగిస్తూనే సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నేటి యువత సన్మార్గంలో పయ నిస్తూ తమ జీవిత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. పుట్టిన గడ్డ గర్వపడేలా మరో పది మందికి ఆదర్శంగా నిలుస్తూ పేరు, ప్రతిష్ఠలు సంపాదించాలని సూచించారు. ర్యాంకర్ల లక్ష్య సాధన అంశాలపై, వాళ్ల కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కె వెంకటేష్, కార్పొరేటర్ దిండిగాల మహేష్, న్యాయవాదులు ఉప్పల అంజనీప్రసాద్, ఏవీ రమణ, ఏ కిరణ్‌కుమార్, ర్యాంకర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం

- రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు ఉపాధి కల్పించే వరకు అండగా ఉంటా
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



సిరిసిల్లలో ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 21: వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. సిరిసిల్లలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వంద మంది నాయకులు బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభం సమసిపోలేదన్నారు. నేతన్నలంతా ఐక్యంగా ఉండి సమ్మె చేశారన్నారు.

ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తాను లేఖ రాసి, అనేక రూపాల్లో ప్రభుత్వ తీరును ఎండగట్టానని, స్పందించకపోవడంతో నేతన్నలకు మద్దతుగా సిరిసిల్లలో నేతన్న దీక్షను చేసేందుకు సిద్ధమైతే తప్ప ప్రభుత్వం దిగిరాలేదన్నారు. 270 కోట్ల బకాయిలుంటే కంటి తుడుపు చర్యగా 50 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో ఆ నిధులను కూడా ఆపేం దుకుం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. అదే జరిగితే ఉరుకునే ప్రసక్తే లేదన్నారు. దీంతో పాటు మిగిలిన బకాయిలన్నీ నేతన్నలకు ప్రభు త్వం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం ముమ్మాటికి బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. మాస్టర్ వీవర్స్ పేరుతో పెద్ద యాజమానులకు బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇచ్చి యజమానులను ఆసాములుగా, ఆసాములను కూలీలుగా మార్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం వెంటనే పాత బకాయిలను చెల్లించి సంవత్సరం పాటు ఉపాధికి ఇబ్బంది లేకుండా నేతన్నలకు కొత్త ఆర్డర్లను ఇవ్వాలన్నారు. పాత విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలన్నారు. కార్మి కులకు ఇవ్వాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని వెంటనే అందించాలన్నారు.

గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమలను కాపాడుకోవడానికి నేతన్నలకు ఎప్పుడు అండగా ఉంటానన్నారు. జై శ్రీరాం అంటేనే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు భయం పట్టుకుందని, బీజేపీ నినాదమే జై శ్రీరాం అని అన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం చేసిన అరాచకాలపై, అవినీతి అక్రమాలపై బీజేపీ అలుపెరగని పోరాటాలు చేస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయిన గోపి, రేగుల మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, మట్ట వెంకటేశ్వర రెడ్డి, గౌడ వాసు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బండి సంజయ్‌కుమార్

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే తడిసిన ధాన్యం..

వీర్నపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్లనే ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తడిసిందని ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించి రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో వడ్ల రాశులు పోసి 15 రోజులు కావొస్తున్నా రైతుల ఇబ్బందులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కటింగ్‌లు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

జనగామను సర్వాయ్ పాపన్న జిల్లాగా ఎందుకు మార్చలేదు..

తంగళ్లపల్లి: గౌడన్నల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయ్ పాపన్న పేరును జనగామ జిల్లాకు పెడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మాట తప్పారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. ఆదివారం తంగళ్లపల్లి మండ లం తాడురు శివారులో కాలిపోయిన తాటిచెట్లను పరిశీలించి గీత కార్మికులను బండి సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు కష్టాల్లో ఉన్నారని వారిని ఆదుకోవాలనే సోయి ప్రభుత్వానికి లేకుండా పోయిందని మండిపడ్డారు. తాడురులో ఇటీవల విద్యుదాఘా తంతో మృతిచెందిన మహిళా రైతు మధుప్రియ కుటుంబాన్ని పరామర్శించారు.



ఎవరి దారెటు



- పక్క చూపులు చూస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- అవకాశం కోసం జంప్‌జిలానీల నిరీక్షణ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయనాయకులు వేగంగా రంగులు మార్చుతున్నారు. కార్యకర్తలు, నాయకుల కంటే ముందే ప్రజాప్రతినిధులు పార్టీలను ఫిరాయి స్తుండడంతో ఏనాయకుడు ఏ పార్టీలో ఉన్నారో... ఎప్పుడు ఎవరు పార్టీ మారుతాడో తెలియని పరిస్థితి నెలకొన్నది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వేగం గా మారుతున్న రాజకీయ సమీకరణాలతో ప్రజాప్రతినిధులు పార్టీల ఫిరాయింపులపై సమాలోచనలు చేస్తున్నారు.

బల్దియాలో ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్

కరీంనగర్ నగరపాలక సంస్థలోని 60 డివిజన్లలో 46 మంది బీఆర్ఎస్, బీజేపీకి ఏడుగురు, ఎంఐఎం పార్టీకి ఏడుగురు కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్కరు కూడా కార్పొరేటర్ లేరు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంతకుముందు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన కొంత మంది కార్పొరేటర్లు సొంత గూటికి వెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ముగ్గురు, నలుగురు కార్పొరేటర్లు ఇప్పటికే రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పార్టీలో చేరేందుకు చర్చలు జరిపారు.

అప్పటికే కొంత మంది కార్పొరేటర్లు, ఇతర నాయకులపై భూ కుంభకోణాల కేసులుపెట్టి పోలీసులు అరెస్టు చేయడంతో కాంగ్రెస్‌లో వారిని చేర్చుకునేందుకు మంత్రి ఆసక్తి చూపక పోవడంతో కార్పొరేటర్ల చేరిక వాయిదా పడింది. ఇప్పటి వరకు ఒక్క కార్పొరేటర్ కూడా అధికారికంగా కాంగ్రెస్‌లో చేరలేదు. కానీ కొంత మంది మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరి మున్సిపాలిటీలో తిరిగి పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతుండడం, కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ పార్టీ మారుతారనే ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో వారి భవిష్యత్‌పై సమాలోచనలు చేస్తున్నారు.

మంత్రి పొన్నంతో టచ్‌లో..

ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇతర పార్టీల నుంచి ఎవరు వచ్చినా చేర్చుకోవాలని నిర్ణయం తీసుకుంది. కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనేది ఇంకా ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించక పోవడంతో అభ్యర్థి ప్రకటన తర్వాత చేరితే బాగుంటుందా లేక ముందే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి చేరితే భవిష్యత్ ఉంటుందా అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. 10 నుంచి 12 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర నాయకులను కలిసి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారు. కొంత మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లో భవిష్యత్ ఉండక పోవచ్చని, పార్లమెంట్ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో చేరి వచ్చే ఏడాదిలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ పక్కా చేసుకోవాలని భావిస్తున్నారు. మరికొంత మంది కార్పొరేటర్లు పార్ల మెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయని, అప్పుడు ఆలోచించి ఆ తర్వాత పార్టీ మారడంపై నిర్ణయం తీసుకోవాలని చర్చిం చుకుంటున్నారు.

కాంగ్రెస్‌లోకా.. బీజేపీలోకా..

ముగ్గురు, నలుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు బీజేపీలో చే రేం దుకుం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖరారైన తర్వాత చేరికలపై మంత్రి పొన్నం దృష్టిసారిస్తారని, ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతనే చేరాలని మరి కొందరు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఇటీవల డివిజన్‌లోని ప్రముఖులు, వాకర్స్‌కు బ్రేక్ ఫాస్ట్‌తో స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. నాలుగైదు డివిజన్లకే ఆ మీటింగ్‌లు పరిమితం కావడంతో కార్పొరేటర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదని ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖరారైన తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి కార్పొరేటర్ల చేరికలు తప్పవని అనుకుటుంన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు నష్టం జరుగకుండా ఆ పార్టీ ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో చూడాలి.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

● ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21: కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఐదు సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపి న వివరాల ప్రకారం రామడుగు మండల కేంద్రానికి చెందిన దంపతులు తమ కుమారుడు కీర్తి చైత్రిక్(5)కు గుండెకు సంబంధించిన సమస్యతో ఈ నెల 19న నగరం లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అతడికి ఈనెల 20న ఆపరేషన్ చేయగా అదే రోజు రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఆపరేషన్ వికటించడం వల్లే తమ బాబు మరణించాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

● ఆసుపత్రిని సీజ్ చేయాలి

బాలుడి మృతికి కారణమైన ఆసుపత్రిని సీజ్ చేయా లని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్ డిమాండ్ చేశా రు. ధనార్జనే ధ్యేయంగా రోగుల జీవితాలతో ఆడుకుంటు న్నారని ఆరోపించారు. కీర్తి చైత్రిక్‌కు గుండెకు రంధ్రం ఉందని ఆపరేషన్ చేయాలని, రూ.1,70,000ల ప్యాకేజీ అని చెప్పి ఆపరేషన్ చేశారని ఆరోపించారు. అయినప్ప టికీ మరణించాడని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేప డతామని వారు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 21: మండలంలోని గట్టుదుద్దెనపల్లిలో ఆదివారం మోటారుసైకిల్‌ను కారు ఢీ కొన్న ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి గట్టుదుద్దెనపల్లి వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా కరీంనగర్ నుంచి వరంగల్ వెళుతున్న కారు ఢీకొట్టింది. కిందపడిన శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది కరీంనగర్‌కు తరలించారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



పోశయ్య మృతదేహం

వీణవంక, ఏప్రిల్ 21: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన బొంగోని పోశయ్య (73) అనే వృద్ధుడు బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశయ్య శనివారం ఉదయం బహిర్భూమికి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుం డగా ఇంటికి దగ్గరలో గల పొలం సమీపంలో ఉన్న బావి గట్టు పైన చెప్పులు, చేతికర్ర కనిపించాయి. అనుమానంతో బావిలో వెతుకగా పోశయ్య మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో ఒకరు..

శంకరపట్నం, ఏప్రిల్ 21: వడదెబ్బతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన బుద్ధార్తి నర్సయ్య (70) అనే వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం నర్సయ్య మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 21 : చందుర్తి మండలం మూడపల్లి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి కట్ట లింగంపేట గ్రామం చెందిన యువకుడుకి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం..మండలంలోని కట్ట లింగంపేట గ్రామానికి చెందిన గుడిపల్లి గంగాధర్ అనే యువకుడు బైక్‌పై వేములవాడ నుంచి కట్టలింగంపేట గ్రామానికి వెళుతుండగా మూడపెల్లి వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడిన గంగాధర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి..

గంభీరావుపేట, ఏప్రిల్ 21: మండలంలోని ముస్తాఫనగర్‌లో ఓ యువకుడుకి విద్యుదాఘాతంతో తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కె స్వామి ఆదివారం ఆకస్మాత్తుగా విద్యుదాఘాతంతో గురవ్వడంతో సిరిసిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 21: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు సుద్దాల దేవయ్యగౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వృత్తిలో భాగంగా ఆదివారం తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. దేవయ్యను జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

ఎలిగేడు, ఏప్రిల్ 21: పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. ఉదయం ఇంటి పక్కనున్న రోడ్డుపై ఆడుకుంటున్న మెరుగు రమేష్, స్వప్న దంపతుల కుమారుడు శ్రీరామ్(3)తోపాటు మరో ముగ్గురిపై పిచ్చి కుక్క దాడి చేసింది. శ్రీరామ్ తల, ఇతర చోట్ల తీవ్రంగా గాయపరిచింది. శ్రీరామ్‌ను చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తర్వాత వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకల్వల గ్రామానికి చెందిన నలుగురు బసంత్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యానికి వెళ్లి తిరిగి పెద్దపల్లికి వస్తున్న క్రమంలో అందుగులపల్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కారు బోల్తాపడింది. కారులో నలుగురు ప్రమాణిస్తుండగా ఇద్దరికి గాయాలు కావడంతో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, ఏప్రిల్ 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను ఆదివారం ఏఎస్సై వెంకటరమణ పట్టుకున్నారు. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం నామాపూర్ గ్రామానికి చెందిన వానరాసి దుర్గయ్య అనే వ్యక్తి దాదాపు ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇంట్లో నిలువ ఉంచగా ఏఎస్సైకి అందిన సమాచారం మేరకు వాటిని పట్టుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

కారు బైక్ ఢీ : ఒకరి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 21 : కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ సమీపంలో ఆదివారం కారు బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై ఉన్న ఆదిత్య(16)మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల వైపు నుంచి కారు కరీంనగర్ వైపు వెళ్తుండగా దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ సమీపంలో చల్‌గల్ గ్రామానికి చెందిన ఎం.ఏ సమద్, ఎస్.ఆదిత్య బైక్‌పై కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వస్తుండగా కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న చల్‌గల్ గ్రామానికి చెందిన ఎం.ఏ సమద్, ఎస్. ఆదిత్యకు గాయాలయ్యాయి. క్షత గాత్రులను కొడిమ్యాల బ్లూ కోట్ పోలీసులు చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న ఎస్.ఆదిత్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

డిపాజిట్ల పేరుతో మోసం

● చేతులెత్తేసిన సంస్థ ● బాధితుల ఆందోళన

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21: జిల్లాలో ఓ సంస్థ రికరింగ్ డిపాజిట్లు సేకరించి గడువుతీరాక చెల్లింపులు చేయక చేతులెత్తేయడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ సంస్థ ప్రధాన కార్యాలయంను నెలకొల్పి సిరిసిల్ల, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట తదితర ప్రాంతాలలో రికరింగ్ డిపాజిట్‌లు, డిపాజిట్‌లు సేకరించింది. రికరింగ్ డిపాజిట్‌లు, డిపాజిట్‌ల సేకరణకు కమీషన్‌ల ఆశ చూపడంతో పలువురు నిరుద్యోగ యువకులు ఏజెంట్లుగా చేరి అనేకమంది వద్ద పొదుపు పేరిట డిపాజిట్‌లు సేకరించారు. ఒక్కొక్కరి వద్ద ప్రతి నెల రూ.1000 నుంచి రూ. 10 వేలు వసూలుచేసి 60 నెలలకు సేకరించారు. ఈ విధంగా వందలాది మంది డిపాజిట్‌లు, రికరింగ్ డిపాజిట్‌ల పేరిట డబ్బులు కట్టి గడువు తీరిన తర్వాత ఆ డబ్బు రెట్టింపు మొత్తంను ఆ సంస్థ చెల్లించడం లేదు. రికరింగ్ డిపాజిట్‌ల సేకరణకు ఏర్పాటు చేసిన ప్రధాన కార్యాలయం తెరువడం లేదు. దీంతో అనేక మంది బాధితులు కార్యాలయానికి వచ్చి ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆ సంస్థపై జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆ సంస్థపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ విషయమై సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతిని సంప్రదిస్తే ఇప్పటివరకు ఆ సంస్థపై ఒక కేసు నమోదు చేశామని, సిరిసిల్ల పట్టణంలోని పత్తిపాక వీధిలో ఏర్పాటు చేసిన ఆ సంస్థలో ఎవరైనా పెట్టుబడి పెట్టి నష్టపోయి ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ నేత మృతి



శేఖర్ (ఫైల్)

గొల్లపల్లి, ఏప్రిల్ 21 : పెగడపల్లి మండలం నందగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గొల్లపల్లి మండల యూత్ ప్రధాన కార్యదర్శి, మండలంలోని ఇబ్రాజ్ పల్లె గ్రామానికి చెందిన సంకటి చంద్రశేఖర్ యాదవ్ (31) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చంద్రశేఖర్ కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి వెళ్లి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అనుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. చంద్రశేఖర్‌కు తల్లిదండ్రులు, భార్య శిరీష, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధిత కుటుంబానికి రూ.20వేలు అందించాడు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న బోనాలు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 21 : మండలంలోని మాసాయిపేట గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర వైభవంగా యాదవుల ఆధ్వర్యంలో జరిపారు. ఆదివారం ఉదయం ఆలయంలోని ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు పురోహితుడు నిర్వహించారు. సాయంత్రం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొసగంటి మహేష్, మొండి వెంకటేష్‌యాదవ్, జాయ మహేష్‌యాదవ్, శరత్, అరుణ్, శ్రీకాంత్ సెందిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు

● మూడు రోజుల పాటు వేడుకలు
● తరలిరానున్న లక్షలాది భక్తులు

మల్యాల ఏప్రిల్ 21: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి యేటా నిర్వహించే హనుమాన్ చిన్న జయంతిని సోమవారం నుంచి బుధవారం వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు రోజులపాటు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కాలి నడకన, వాహనాల ద్వారా అంజన్న సన్నిధికి చేరుకోనున్నారు. ఇక్కడ మాల విరమణ చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. కొండగట్టులో జరిగే ఉత్సవాల కోసం అంజన్న ఆలయ పరిసరాలలో క్యూలైన్, బారికేడ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు సుమారు 650మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దిగువ కొండగట్టు, ఘాట్‌రోడ్డు, కొండపైన, ఆలయం, దీక్షవిరమణ మండపం, ప్రసాదాల కౌంటర్, కోనేరు, పార్కింగ్ స్థలాలు, జేఎన్ టీయూ, దొంగల మర్రి ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తారు.



కొండగట్టులో స్వాగత తోరణం



కొనసాగుతున్న పనులు



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

● ఏర్పాట్లు ఇలా..

- కొండపైన, ఘాట్‌రోడ్డుపైన 28 చోట్ల చలివేంద్రాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా భక్తులకు నీటిని అందించనున్నారు.
- ఘాట్‌రోడ్డు వాహనాలకు అనుమతి లేకపోగా.. కొండపైన బొజ్జ పోతన్న, కొండగట్టు స్టేజీల వద్ద పోలీసుల ఔట్ పోస్టు
- దీక్షవిరమణలకు ప్రస్తుతం ఉన్న అర్చకులకు తోడు మరో వంద మంది సిబ్బంది.
- కొండగట్టు స్టేజీ సమీపంలోని తుమ్మ చెరువు, కొండపైన బొజ్జ పోతన్న ఆలయం, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో బృందావనం రిసార్ట్, జేఎన్‌టీ యూ సమీపంలో కొండపైకి వెళ్లే మార్గంలో, దాని పక్కనే మరొకటి వాహనాల కోసం పార్కింగ్
- బస్టాండ్ వద్ద 14 ప్రసాద, టికెట్ కౌంటర్లు
- 5 కేంద్రాలలో మూడు షిఫ్టులలో కొండపైన, స్టేజీ వద్ద వైద్య సిబ్బంది విధులు
- మెట్ల మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటు. 24గంటల విద్యుత్ సౌకర్యం. 9 జనరేటర్‌ల ఏర్పాటు
- అందుబాటులో ఫైర్ ఇంజన్.. అంబులెన్స్, భక్తులకు సరిపడా ఆర్టీసీ బస్సుల సేవలు
- తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు

అన్ని ఏర్పాట్లు చేశాం

చంద్రశేఖర్, ఈవో

జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి కోసం చలివేంద్రాలు, మొబైల్ చలివేంద్రాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాం.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం

ముత్తారం, ఏప్రిల్ 21: మంథని-ఓడేడు ప్రధాన రహదారి ముత్తారంలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ముత్తారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపాన ప్రధాన రహదారి పైనే ఇసుక డీడీల కోసం లారీలు రోడ్డుపై నిలిపివేయడంతో ఓడేడు నుంచి గోదావరిఖని వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీని ఢీకొట్టాడు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులో ఎక్కు మంది ప్రయాణికులు లేకపోవడంతో పాటు రోడ్డుపై ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మరిమడ్లలో హైమాస్ట్ లైట్‌ల చోరీ

కోనరావుపేట, ఏప్రిల్ 21 : కోనరావుపేట మండలం మరిమడ్లలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హైమాస్ట్ లైట్లను అపహరించారు. మరిమడ్ల గ్రామంలోని పల్లెప్రకృతి వద్ద నూతనంగా ఏర్పాటు చేసి దానికి సంబంధించిన పనులు కొనసాగుతున్న నేపథ్యంలోనే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం : హుజూరాబాద్ యువకుడి మృతి



ముక్క నివేష్ (ఫైల్)



డాక్టర్ నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రణవ్

హుజూరాబాద్, ఏప్రిల్ 21: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి శనివారం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ ముక్క నవీన్-స్వాతి దంపతుల కుమారుడు ముక్క నివేష్ (19) బీటెక్ చదవడం కోసం ఏడాదిన్నర క్రితం అమెరికాలోని అరిజోనా రాష్ట్రానికి వెళ్లాడు. ప్రస్తుతం నివేష్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నివేష్ శనివారం (అమెరికా కాలమాన ప్రకారం) తన స్నేహితులతో కలిసి కారులో జలపాతం చూసేందుకు వెళ్లాడు. తిరిగి అరిజోనాలోని తన ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. కారులో వెనుక కూర్చున్న నివేష్‌తో పాటు హనుమకొండ జిల్లా స్టేషన్ ఘణపూర్‌కు చెందిన గౌతమ్ అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. అరిజోనా పోలీసులు నివేష్ తండ్రి డాక్టర్ నవీన్‌కు సమాచారం అందించారు. చదువు కోసం వెళ్లిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నవీన్ కుటుంబంలో విషాదం నెలకొంది. కాగా నివేష్ తాత కృష్ణమూర్తి సైతం వైద్యుడిగా సేవలు అందించారు. నివేష్ మృతదేహం అమెరికా నుంచి హుజూరాబాద్‌కు రావడానికి మూడు రోజులు పట్టే అవకాశం ఉందని సమాచారం.

● పలువురి పరామర్శ

ప్రముఖ వైద్యుడు నవీన్ కుమారుడు అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌తో పాటు పలువురు ప్రముఖులు నవీన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, ఇనుగాల పెద్దిరెడ్డి నవీన్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

గంజాయి విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు



మాట్లాడుతున్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 21: గంజాయి రవాణా, విక్రయాలు జరిపితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇనిస్పెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి 5కిలోల గంజాయి స్వాధీనపరచుకుని సీజ్ చేసామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్, ఒడిశా నుంచి అదే రాష్ట్రానికి చెందిన ఇద్దరు మైనర్ల ద్వారా 5కిలోల గంజాయిని తెప్పించి ముగ్గురు జగదల్పూర్‌లో కలుసుకుని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలలో గంజాయి అలవాటు పడిన వ్యక్తులకు అమ్మి సులవుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇదే క్రమంలో జగదల్పూర్ నుంచి బస్సులో కరీంనగర్‌కు అక్కడి నుండి వేములవాడ మండలం చింతల్‌ఠాణా శివారుకి వస్తున్నారన్న సమాచారంతో శనివారం సాయంత్రం చింతల్‌ఠాణా బస్‌స్టాప్ వద్ద వేములవాడ పట్టణ పోలీసలు అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి 5కిలోల గంజాయిని స్వాధీన పరచుకున్నారు. గంజాయి మహమ్మారిని తరమికొట్టడంలో బాగంగా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ ప్రాంతంలో నిషేధిత గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. మన చుట్టుప్రక్కల గంజాయి విక్రయించినట్లు తెలిసినా, గంజాయిని సేవిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100కు డయల్ చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సంవత్సరంలో జిల్లాలో గంజాయికి సంబంధించి 14 కేసులు నమోదు చేసి 39 మందిని అరెస్టు చేసామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గంజాయి నిందితులను అరెస్టు చేయడంలో చురుకుగా వ్యవహరించిన ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు సమీ, గోపాల్, శ్రీనివాస్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ రివార్డులను అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో వేములవాడ ఇంచార్జి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ , పట్టణ ఇంచార్జి సీఐ శ్రీనివాస్, టౌన్ ఎస్సై అంజయ్య, పోలీసు సిబ్బంది ఎటటటటటటటటటటటటాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామచంద్ర స్వామి రథోత్సవం

● భారీగా తరలి వచ్చిన భక్తులు



స్వామివారి రథోత్సవం

బీర్‌పూర్,ఏప్రిల్ 21:బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో ఆదివారం శ్రీ రామచంద్ర స్వామి రథోత్సవం వైభంవగా జరిగింది. సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందంగా రంగు రంగుల పూలతో అలంకరించిన రథం వద్దకు సన్నాయి మేళాలతో వేదపండితుల మత్రోత్సరణల మధ్య తీసుకవచ్చి రథంపై ఆశీనుల గావించి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం నిర్వహిస్తున్న సమయంలో హనుమాన్ దీక్షాపరులు రామ భజనలు చేస్తూ నృత్యాలు చేశారు. జాతర బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఆయా ప్రాంతాలనుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలలో భక్తుల దాహార్తిని తీర్చడం కోసం గ్రామంలోని అక్షర హైస్కూల్ కరస్పాండెంట్ పైడి మారుతి ఆధ్వర్యంలో మజ్జిగా ప్యాకెట్లు, చల్లని నీరు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ పాత పద్మ రమేస్, ఎంపీటీసీ రంగు లక్ష్మన్, ఆలయ చైర్మన్ సతీస్, నాయకులు గుండేటి సురేష్, గాజర్ల రామచంద్రం గౌడ్, రామకిష్టు గంగాధర్, రంగు మల్లేశం, జక్కుల చెంద్రయ్య, రవిందర్ రావ్ భక్తులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని ఆక్రమించిన కేసులో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ.ప్రదీప్‌కుమార్ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన తెల్ల రాజయ్య అనే వ్యక్తి 2003లో తీగలగుట్టపల్లిలో సర్వేనెంబరు 233/ఇ లోని వెంచర్‌లో 293.33 గజాల విస్తీర్ణం కలిగిన 16వ ప్లాట్‌ను మూలగౌరారెడ్డి వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మూల గౌరారెడ్డి మరణానంతరం అతని కొడుకు మూల తిరుమలరెడ్డి ఆ ప్లాట్ మాదేనంటూ ఆక్రమించుకుని, రెండు ప్లాట్లుగా విభజించి ఆ ప్లాట్ మూల వీరమ్మ పేరిట తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించాడు. అనంతరం ఆ రెండు ప్లాట్లను మూల సూర్యప్రకాష్‌రెడ్డి, లంక శేఖర్‌లకు విక్రయించినట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించడంతో పాటు ఆ స్థలంలో గోడను కూడా నిర్మించారు. దీంతో బాధితుడు తెల్ల రాజయ్య కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం నిందితులు భూమిని విక్రయించి, మళ్లీ ఆ భూమిని ఆక్రమించినట్లు వెల్లడైంది. ఈ మేరకు నిందితులపై ఐపీసీ సెక్షన్ 420, 467, 468, 471, 120 బి, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితు లు మూల తిరుమల్‌రెడ్డి, లంక శేఖర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పల్లెల్లో ప్రబలుతున్న పచ్చకామెర్లు



తుర్కలమద్దికుంటలో రక్త నమూనాల సేకరణ

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని పలు గ్రామాల్లో 120 మందికి పైగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నారు. మండలంలోని తుర్కలమద్దికుంట, అప్పన్నపేట, హన్మంతునిపేట, భోజన్నపేట గ్రామాల్లో కలుషిత నీటి వల్ల పచ్చకామెర్ల వ్యాధి వస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో హన్మంతునిపేట, భోజన్నపేట గ్రామాల్లో పచ్చకామెర్ల వ్యాధి ప్రారంభ దశలో ఉంది. ప్రభుత్వ వైద్యుల దృష్టికి వచ్చిన ప్రకారం కలుషిత నీటితో తయారు చేసిన ఐస్ క్రీం, క్లోరినేషన్ లేని తాగునీటి వల్ల వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. అత్యధిక కేసులు నమోదు అయిన గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తూ నివేదికలను వైద్యాధికారులకు పంపిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంబంధిత గ్రామాల్లో తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేసిన తరువాతనే సరఫరా చేస్తున్నామని ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

అప్పు ఇచ్చిన వారి వేధింపులతో మహిళ ఆత్మహత్య



రాజమల్లమ్మ

సుల్తానాబాద్, ఏప్రిల్ 21: అప్పుల వారి వేధింపులు భరించలేక పోగుల రాజమల్లమ్మ (57) మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుద్దాల గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన పోగుల గట్టయ్య రాజమల్లమ్మ దంపతులు అదే గ్రామానికి చెందిన పోగుల సంపత్ వద్ద నాలుగేళ్ల క్రితం ఒక లక్ష ముప్పైవేల రూపాయలను అప్పుగా తీసుకున్నారు. ఈ అప్పు తీర్చాలంటూ సంపత్ పదే పదే రాజమల్లమ్మ ఇంటి వద్ద గొడవ చేసేవాడని తరుచూ వారు ఉండే ఇంటికి తాళాలు వేసి వేధించేవాడని చెప్పారు. ఏడాది క్రితం గట్టయ్య చనిపోగా ఆయన భార్య రాజమల్లమ్మ ఒంటరిగా ఇంటి వద్ద ఉంటుంది. ఆమెను అప్పు చెల్లించాలని వేదిస్తున్నారు. పలు సార్లు పెద్ద మనుష్యుల వద్ద పంచాయతీలు కూడా జరిగాయి. దాంతో ఏడాది క్రితం రాజమల్లమ్మ లక్ష రూపాయలను సంపత్‌కు చెల్లించింది. కాగా మిగిలన ముప్పై వేల రూపాయలతో పాటు వాటికి సంబంధించిన వడ్డీ చెల్లించాలని రాజమల్లమ్మ ఇంటి వద్దకు వచ్చి సంపత్ వేధింపులకు గురి చేసేవాడని ఈ నేపథ్యంలో శనివారం కూడా రాజమల్లమ్మను ఇలాగే వేధించగా అమె వనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ అస్పత్రికి తర లించగా మెర్గగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకువెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆది వారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతురాలి కొడుకు పోగుల ప్రభాకర్ ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

వైభవంగా సీతారాముల ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలు



మల్కాపేట రామాలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి

కోనరావుపేట, ఏప్రిల్ 21: కోనరావుపేట మండలం మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపైన నిర్మించిన సీతారాముల ఆలయంలో ఆదివారం శ్రీ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. కోనరావుపేట మండలం మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతంలోని గుట్టపైన మాజీ మంత్రి ఆనందరావు కుటుంబ సభ్యులు చెలిమెడ వెంకటేశ్వరరావు, లక్ష్మీనరసింహారావు, మధుసూదన్‌రావు కుటుంబ సభ్యుల సహకారంతో రామాలయ నిర్మాణాన్ని నిర్మించారు. ఈ నెల 18 నుంచి ఆదివారం వరకు ధ్వజస్తంభన ఉత్సవాలు ప్రాణప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభ ఏర్పాటుకు శనివారం రాత్రి చిన్న జీయర్‌స్వామి మల్కాపేటకు చేరుకొని ఆదివారం ఉదయం నుంచి ఆయన చేతుల మీదుగా విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులను, భక్తులను దీవించారు. పక్కనే ఉన్న మల్కాపేట రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు, అతి తొందరలోనే ఈ ప్రాంతం ఆధ్యాత్మికతతో విరాజిల్లుతుందని ఈ ప్రాంతానికి సీత, రామ, లక్ష్మణులు వచ్చారని ఈ ప్రాంతం ధన్యమైపోతుందని భక్తులకు ఉపదేశాన్ని ఇచ్చారు. ఈ వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, లోకయుక్త చైర్మన్ సి.వి.రాములు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ఫ్యాక్స్ చైర్మన్లు రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, గ్రామ మాజీ సర్పంచ్‌ఆరె లత, మహేందర్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు మల్యాల దేవయ్య, రాఘవరెడ్డితో పాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వయస్సు శరీరానికే కాని మనస్సుకు కాదు

-రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 21: వయస్సు శరీరానికే కాని మనస్సుకు కాదని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాలులో జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సద్గుణ సంపత్తి గలవారి జీవితాలు ఎల్లప్పుడూ సమాజానికి అనుసరణీయమన్నారు. మహోను భావులు తమ చైతన్యశక్తిని సమాజానికి అందించాలన్నారు. వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి మాట్లాడుతూ మన జీవితాలు ఇతరులకు చీకటి నుంచి వెలుగుకు మళ్ళించే మార్గదర్శకాలు కావాలన్నారు. వోపా అధ్యక్షుడు విష్ణువర్ధన్ సభాధ్యక్షత వహించగా అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్‌ఆచార్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, మొగ్గుంపూర్ విశ్వబ్రాహ్మణ కాలనీ అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, యాస్వాడ అంజయ్య బండ్ల శివప్రసాద్, వంగల ఆనోధరాచారి, ఎర్రోజు భీష్మాచారి, తిప్పర్తి అంజయ్య తిప్పర్తి ఆనందం, నాగలక్ష్మి, సంగోజు రామకృష్ణయ్య, వజ్రమ్మ, శ్రీరామోజు చిరంజీవాచారి, లలితాదేవి, కొత్తూరి శంకరయ్య పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తకు బండి సంజయ్ పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పృథ్వీరాజ్‌ను పరామర్శిస్తున్న బండి సంజయ్

భగత్‌నగర్, ఏప్రిల్ 21: కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ కార్యకర్త పృథ్వీరాజ్‌ను బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన బీజేపీ కార్యకర్త పృథ్వీరాజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బండి సంజయ్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



సాయికిరణ్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భగత్‌నగర్, ఏప్రిల్ 21: యుపీఎస్సీలో ఆలిండియా 27 ర్యాంకు సాధించిన సాయి కిరణ్‌ను లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ మానవాడ శంకర్, ట్రెజరర్ నలువాల గిరిధర్‌రావు, థర్డ్ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి రాములు, కో-ఆర్డినేటర్ రమేష్, లయన్‌సభ్యులు మమతవేణు, కోమటిరెడ్డి తిరుపతిరెడ్డి, రామేశ్వరరావు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: సివిల్స్‌లో 27వ ర్యాంకు సాధించిన సాయికృష్ణను టీఎన్‌జీవో నాయకులు సన్మానించారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ రాష్ట్ర సంచాలకులు మర్తినేని వెంకటేశ్వరరావు చేతుల మీదుగా టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో స్టేట్ ఆడిట్ డిప్యూటి డైరెక్టర్ పోరిక రాము, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటి డైరెక్టర్లు రాజ్‌కుమార్, శరత్‌చంద్ర, నూతనకంటి వెంకన్న, కృపాకర్‌రావు, టీఎన్‌జీవో నాయకులు ముప్పిడి కిరణ్‌కుమార్, సర్దార్ హర్మిందర్ సింగ్, ఏవి రాజేశ్వరరావు, సిహెచ్ జోయల్, అల్లె శ్రీనివాస్, లక్ష్మీకాంతయ్య, పవన్‌కుమార్, రవిబాబు, వంశీ, శంకర్, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ ఆలయంలో బోనం సమర్పిస్తున్న మహిళలు

గంగాధర, ఏప్రిల్ 21: గంగాధర మండలం మధురానగర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు కొత్త కుండలో నైవేద్యం తయారు చేసి బోనంతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పోచమ్మ బోనాలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపీపీ



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఏప్రిల్ 21: గంగాధర వైస్ ఎంపీపీ కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు, మాజీ జడ్పీటీసీ గునుకొండ బాబు, మాజీ ఎంపీపీ పడితపల్లి కిషన్, చొప్పదండి మాజీ ఎంపీపీ క్రిష్ణహరి, తాజా మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలతో 100 మంది ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంటు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వారికి కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌తో సంక్షేమాభివృద్ధి సాధ్యమని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సైదాపూర్, ఏప్రిల్ 21: మండలంలోని వెన్కేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992-93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక చోట చేరి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఆనాడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు కొత్త మల్లారెడ్డి, కవ్వ తిరుపతి రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు మోహన్, కుమార్‌రాజ, శ్రీనివాస్, రాజయ్య, శబ్బీర్, సంపత్, రాజు, వసంత పాల్గొన్నారు.

భాషా పండితుల పదోన్నతుల కోసం కృషి



మాట్లాడుతున్న ఆర్‌యుపిపిటి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 21: అపరిష్కృతంగా ఉన్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ (ఆర్‌యుపిపిటి) రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.అబ్దుల్లా అన్నారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దీర్ఘకాలికంగా భాషా పండితుల పదోన్నతులకు సంబంధించిన కేసులో హైకోర్టు డివిజన్ బెంచ్ భాషా పండితులకు అనుకూలంగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పండిత పరిషత్ సుదీర్ఘ పోరాటానికి ఈ తీర్పు నిదర్శనమని అన్నారు. డివిజన్ బెంచ్ తీర్పురాగానే పండిత పరిషత్ రాష్ట్రశాఖ పక్షాన సుప్రీం కోర్టులో కేవెట్ వేయడం జరిగిందని అన్నారు. అలాగే విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను కలిసి కోర్టు తీర్పుకు అనుగుణంగా వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. పదోన్నతులకు ఆటంకంగా ఉన్న టెట్ పరీక్షను ఆర్‌టిఇ ఆక్ట్ ప్రకారం భాషా పండితులకు మినహాయించాలని ఎన్‌సిఇఆర్‌టి రాష్ట్ర విద్యాశాఖ పక్షాన వివరణ కోసం లేఖను పంపించడం జరిగిందని అన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను పాఠశాలల్లో వెంటనే చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.చైతన్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిన్నింటి బాల్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి.ఉమర్ ఆలీ, గోపాల్, కట్టెకోల స్వామి, ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణాకర్, జిల్లా బాధ్యులు శ్రీనివాస్ అయ్యంగార్, దీపక్ మిథానీ, శ్యామ్, ఎండి.జహంగీర్, రేణుక, శారద, సునిత పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడిని ఆదుకోవాలి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21: అగ్నిప్రమాదంలో ఆస్తి నష్టం కలిగిన బాదుతుడిని ఆదుకోవాలని 3వ డివిజన్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ఆదివారం కరీంనగర్ అర్బన్ తహసీలాందర్‌కు విజ్ఞప్తి చేవారు. ఈ మేరకు కార్పొరేటర్ ఆదివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడికి భరోసా కల్పించారు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంటకు కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడు బెజ్జంకి కొమురయ్య ఇంటి పరిసరాలలో అగ్ని ప్రమాదం జరిగి ఆస్తికి నష్టం వాటిల్లిందని, దీనిని పరిశీలించి బాధితుడికి పరిహారం అందించాలని కోరారు. కొమురయ్య ఇంటి వద్ద హఠాత్తుగా పెద్దఎత్తున అగ్ని మంటలు అంటుకోగా స్థానికులు వెంటనే స్పందించి పైప్ ద్వారా మంటలను ఆర్పే చర్యలు చేపట్టేసరికే డ్రమ్ములు, వాసాలు, బకెట్‌లతో పాటు విద్యుత్ సర్వీస్ వైర్ మంటలకు అంటుకొని విద్యుత్ పరికరాలు కూడా కాలిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం, తహసీల్దార్ వెంటనే స్పందించి అగ్నిప్రమాదంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, బాధితుడికి ఆర్థికంగా సహాయం అందించాలని కోరారు.

'రాముడి ఫొటోతో ప్రచారమెందుకు?'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్21: ఎంపీగా నియోజకవర్గం అభివృద్ధికి ఎలాంటి పనులు చేయకుండా ఓట్లను దండుకునేందుకు రాముడి ఫొటోతో ప్రచారమెందుకు చేస్తున్నావని ఎంపీ బండి సంజయ్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రధాని దేశాభివృద్ధికి పాటుపడితే ఆయన ఫొటో కాకుండా రాముడి ఫొటోతో ఓట్లు అడగడమేమిటన్నారు. అవినీతిం అంతమంటూ మోదీ ప్రభుత్వం అవినీతిని చట్టబద్ధం చేస్తూ దోసుకుంటున్నారని అన్నారు. ప్రజాస్వామ్యం అంటూనే ప్రభుత్వాలను కూల్చుతున్నారని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ అంటూ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్నారన్నారు.

కవనభేరి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 21: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'కవనభేరి' కవితా సంకలనాన్ని వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై కవి, శాసన, చారిత్రక పరిశోధకుడు, శ్రీనాథ కవి వంశీకుడు డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ ఆవిష్కరించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల అసోసియేటెడ్ ప్రొఫెసర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి, యోగాచార్య సంపత్‌కుమార్ మాట్లాడారు. భద్రాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కరీంనగర్ శాఖ మేనేజర్ సవ్యసాచి పుస్తక పరిచయం చేశారు. వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూజెట్టి రవీంద్రనాథ్, బొమ్మకంటి కిషన్, గంప ఉమాపతి పాల్గొన్నారు.

దేశ సంపదను దోచుకుంటున్న బీజేపీ

-సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 21: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ సంపదను దోచుకుంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. బీజేపీది దేశభక్తి కాదని ఆ పార్టీని ఓడించాలని సీపీఎం శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ భక్తి ముసుగులో ప్రజలను మభ్యపెడుతూ దేశ సంపదను దోచుకుంటుందన్నారు. మహిళలపై అత్యాచారాలు, రైతుల ప్రాణాలు తీసి, రైతుల పేరుతో దొంగ దీక్ష చేస్తున్నారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు తీసి వేశారన్నారు. కరీంనగర్‌లో ఎంపిగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. బీజేపీతో పాటు అవినీతిలో కూరుకు పోయిన బీఆర్‌ఎస్‌ను ఓడించాలన్నారు. లౌకిక కూటమి అభ్యర్థికి తమ మద్ధతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడికందుల సత్యం, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, నరేష్‌పటేల్, మక్కపల్లి పూజ, గజ్జల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదు

-బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న వినోద్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 21: గడిచిన పదేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తపల్లి పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో శాసన సభ్యుడు గంగుల కమలాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి 23 నవోదయ పాఠశాలలు రావాల్సి ఉంటే పదేళ్ల బీజేపీ పాలనలతో ఒక్కటంటే ఒక్కటి తీసుకు రాలేదన్నారు. నవోదయ పాఠశాల ఎందుకు తీసుకు రాలేదని ఓట్ల కోసం వచ్చే బండి సంజయ్‌ను నిలదీయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత హక్కుల గురించి పార్లమెంట్‌లో గళమెత్తి ప్రశ్నించే గొంతుక కావాలన్నారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ స్మార్ట్ సిటి తీసుకు వచ్చాడన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జమీలుద్దీన్, సీనియర్ నాయకులు బండ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా షాదీఖానా

- ఐదేళ్లుగా ముస్లింల ఎదురుచూపులు



పూర్తి చేయని షాదీఖానా భవనం

మానకొండూర్, ఏప్రిల్ 21: మానకొండూర్‌లో ముస్లిం షాదీఖానా భవనం పనులు ఐదేళ్లుగా అసంపూర్తిగానే ఉన్నాయి. మండల కేంద్రంలోని చెరువు కట్ట కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న తన ఎకరం 20 గుంటల స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన మహ్మద్ బాషమియా అనే వ్యక్తి షాదీఖానా నిర్మాణానికి విరాళంగా ఇచ్చాడు. తెలంగాణ సంక్షేమ శాఖ ఉర్దూ షర్ ముస్లిం షాదీఖానాను ఈ స్థలంలో నిర్మించేందుకు కోటి రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా 12 ఏప్రిల్ 2018న ఈ స్థలంలో అప్పటి పార్లమెంట్ సభ్యుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్, అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ షాదీఖానా పనులకు శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ పిల్లర్లకు గుంతలు తీశారు. ఆ గుంతల్లో నీరు చేరడంతో కొన్ని రోజులు పనులకు ఆటంకం కలిగింది. అనంతరం మోటార్ల ద్వారా నీటిని తొలగించి బేస్‌మెంట్ వరకు నిర్మించారు. అనంతరం నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కంప్యూటర్‌లో షాదీఖానా నిర్మాణానికి వివరాలు లేకపోవడంతో నిధులు మంజూరు కాలేదు. దీంతో తెలంగాణ మైనార్టీ శాఖకు సవరణ కోసం ప్రతిపాదనలు పంపించారు. పూర్తి చేసిన పనులకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అనంతరం ఎవరూ పట్టించుకోక పోవడంతో పనులు నిలిచిపోయాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ముస్లింలు కోరుతున్నారు.

సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు



విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 21: సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ మెషిన్ లర్నింగ్ అనే అంశంపై కిట్స్ సైబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నిర్వహిస్తున్న వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, కొత్త ఆవిష్కరణలకు సమాచారం గుండెకాయ వంటిందన్నారు. వర్క్‌షాప్‌ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కెప్టెన్ రవీంద్రబాబు, హైద్రాబాద్ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ట్రేన్ విసన్, శిక్షకులు విజయ్, సురభి, కార్యక్రమ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి

శంకరపట్నం, ఏప్రిల్ 21: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని జనం విశ్వసించే పరిస్థితి లేదన్నారు. దేశంలో ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్, ఫిర్ ఏక్ బార్ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఉండాలనే కృత నిశ్చయంతో పార్లమెంట్ ప్రజలు ఉన్నారని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొంరయ్య, నాయకులు దాసరపు నరేందర్, కొయ్యడ అశోక్, బిజిలి సారయ్య, పెసరి అర్జున్, రాసమల్ల శ్రీనివాస్, కాంతాల రాజిరెడ్డి, పల్లె శివారెడ్డి, బొజ్జ సాయికుమార్, రాజేందర్, గొల్లపల్లి శ్రీనివాస్, గోపి, కుమారస్వామి, చెరుకు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీని ఆదరించాలి

చిగురుమామిడి: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అసెంబ్లీ కోఆర్డినేటర్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఉల్లంపల్లిలో ఆదివారం



ఉల్లంపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు గెలిపించాలని ఓటర్లను కోరారు. కేంద్రంలో బీజేపీని మరోసారి అధికారంలోకి వచ్చేలా ప్రజలు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకులు రాగుల రవీందర్, పత్తెం మొగిళి, బుర్ర విజయ, చీమ్మర్తి తిరుపతి-లత, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అనంతరం ఫిర్యాదుల స్వీకరణ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు కంప్లైంట్ సెల్‌లో ఎలాంటి ఫిర్యాదులు స్వీకరించబడవని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు మే నెల 13వ తేదీన ఉన్నందున, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఎన్నికల విధుల్లో పోలీసులు నిమగ్నమై ఉంటారని తెలిపారు. ఈ నిబంధనలు ఏప్రిల్ 22వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఎన్నికలు ముగిసిన అనంతరం అనగా మే 14వ తేదీ నుంచి కమీషనరేట్ కంప్లైంట్ సెల్‌లో ఫిర్యాదుల స్వీకరణ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు ఇవ్వాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 21: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా పంచాయతీ కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. జిల్లాలో వివిధ గ్రామ పంచాయతీలలో రెండు నెలల నుండి 10 నెలల వరకు జీతాలు బకాయిలు ఉన్నాయన్నారు. దీంతో గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వెంటనే జీతాలు విడుదల చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్ల ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, కాశిపాక శంకర్, ఎండిగా రవీందర్‌రావు, కండె సదయ్య, వడ్లూరి లక్ష్మీనారాయణ, మహంకాళి కొమురయ్య సారయ్య, మైసవి లక్ష్మి, మధు, శనిగర కొమురయ్య పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్21: కరీంనగర్ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మయ్య తెలిపారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో సంజీవరావు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇంటి పనులను నిలిపివేయండి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 21: నగరంలోని 18,19 డివిజన్ సరిహద్దులో రేకుర్తి నేతకాని కొత్తవాడ స్మశానవాటికకు పోయే రోడ్డులో మున్సిపల్ నిబంధనల మేరకు సెట్ బ్యాక్ కాకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారని, ఈ పనులను వెంటనే నిలిపివేసి రోడ్డు 30 ఫీట్లు ఉండేలా చూడాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దుర్గం మారుతినేత ఒక ప్రకటనలో మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. అలాగే మున్సిపల్ నిబంధనలను పాటించని ఇంటి యజమానిపై చర్య తీసుకోవాలని కోరారు.

మాంసం దుకాణాలు మూసివేత

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 21: మహావీర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలో మాంసం విక్రయాలను నిలిపివేయాలని కమిషన్ బి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు చికెన్, మటన్, బీఫ్ మాంసం దుకాణాలను మూసివేశారు. అక్కడక్కడ తెరచి ఉంచిన దుకాణాలపై కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సానిటేషన్ అధికారులు, ఉద్యోగులు ఆకస్మిక దాడులు నిర్వహించి మాంసం స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు.

మజ్జిగ పంపిణీ

చొప్పదండి, ఏప్రిల్ 21: చొప్పదండిలో మంత్రి పొన్నం ప్రభాకర్ పెళ్లిరోజును పురస్కరించుకొని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, నాయకులు నిజానపురం చందు, పురం రాజేశం, పెరుమాండ్ల గంగయ్య, ముద్దసాని రంగన్న, మునిగాల చందు, మునిగాల సుధాకర్, చిలుక లింగయ్య, పెద్ది రాజేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

మానకొండూర్, ఏప్రిల్ 21: మండలంలోని కొండపల్కల గ్రామంలో గల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు ఆలయ పూజారి నమిలికొండ రఘురామాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న హనుమజ్జయింతి, పట్టాభిషేకం, సాయంత్రం శకటోత్సవం నిర్వహి స్తామని పేర్కొన్నారు. 25న ఉదయం రథోత్సవం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన వేల్పుకొండ రమేష్ పది రోజుల క్రితం మృతి చెందగా ఆదివారం బాల్య మిత్రులు బాధిత కుటుంబానికి 10 వేల నగదును అందజేశారు. మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బైరి కృష్ణ, మహేందర్, రాజేందర్‌రెడ్డి, రాజశ్రీ, శ్రీకాంత్, కృష్ణ, కవిత, జ్యోతి రవళి, పద్మ, సురేష్, సునీత, మంజుల, వనిత తదితరులు ఉన్నారు.

'లోన్ యాప్‌లను నిషేధించాలి'

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 21: క్షణాల్లో రుణాలిస్తామంటూ అప్పుల ఊబిలోకి నెట్టి రుణగ్రహీతల మానప్రాణాలతో చెలగాటమాడుతున్న లోన్‌యాప్‌లను నిషేధించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ నుంచి రుణాలు అందించే వారికి ఆర్‌బీఐ నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఇటీవల దేశంలో వివిధ రాష్ట్రాలలో యాప్‌ల ద్వారా అనేక మందికి నగదు రుణాలు తీసుకొని వాటిని తిరిగి చెల్లించే క్రమంలో సంబంధిత యాప్ యాజమాన్యాలు చేసే వేధింపులు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆర్‌బీఐ చట్టం ప్రకారం 1934లోని సెక్షన్ 45-1 ఎన్‌బీఎఫ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా ఉండాలని తగిన రిజిస్ట్రేషన్ అనంతరమే నిబంధనల మేరకు పనిచేయాలని పేర్కొన్నారు.